క్లుప్తంగా

వ్యాయామంతో ఆరోగ్యం



అంగన్‌వాడీ చిన్నారులతో ర్యాలీ

విజయనగరం ఫోర్ట్: వ్యాయామం చేయడం వల్ల మనసు ఉల్లాసంగా ఉండడంతో పాటు మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని కార్పొరేటర్ చందక శ్రీను అన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీటీ ఆగ్రహారం అంగన్‌వాడీ కేంద్రం పిల్లలతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసు కుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, వరలక్ష్మి, కృష్ణవేణి, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువత

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఏహెచ్‌ఓ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన మెడికవర్ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన శిబిరాన్ని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు ప్రారంభించారు. వైద్యులు 250 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు దాతలు రక్తదానం చేశారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



గెద్దపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గెద్దపేటలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను ఎంపీడీఓ గిరిబాల, తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలకు నష్టపోయిన పంట వివరాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఈఓపీఆర్డీ హెచ్. భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఈఓ శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించగా... 55,243 రూపాయల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, అర్చకులు సోమశేఖర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

దర్బార్‌లో దావతే ఇఫ్తార్..



విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ మాసం రెండో రోజు ఉపవాస దీక్షలను పురస్కరించుకుని బాబామెట్టలో ఉన్న హజరత్ ఖాదర్ బాబా ఔలియా దర్బార్ షరీఫ్‌లో శనివారం సాయంత్రం దావతే ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దర్గా దర్బార్ షరీఫ్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్‌బాబు) ప్రేమవిందు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 5న చలో ఢిల్లీ

విజయనగరం పూల్‌బాగ్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా.. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, నగర కార్యదర్శి బి. రమణ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక స్వావలంబన



పూసపాటిరేగ: గొల్లపేటలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని టీవీలో తిలకిస్తున్న బంగారమ్మ, తదితరులు



డెంకాడ: మోపాదలో వైఎస్సార్ ఆసరా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టీవీలో తిలకిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

పూసపాటిరేగ: వైఎస్సార్ ఆసరా నిధులతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మహంతి జనార్దనరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులు శనివారం జమకావడంతో గొల్లపేటలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు స్వయంశక్తితో ముందుకెళ్లడానికి ఆసరా నిధులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పెంటం నాయుడు, సర్పంచ్ టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భరోసా

నెల్లిమర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేసే ఆన్‌లైన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేశారన్నారు. మాఫీలో భాగంగా మూడో



నెల్లిమర్ల: ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్, తదితరులు

విడత మాఫీ నగదు వారి ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో మెప్మా సీఎంఎం దన్నాన గోవిందరావు, జేసీఎస్ చైర్మన్ మజ్జి గణేష్, సచివాలయ కన్వీనర్లు రవ్వ నాగేంద్రవర్మ, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా..

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ ఆసరా నిధుల జమ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లోనూ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్ పాల్గొన్న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని తిలకించారు. కొండవెలగాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేసే కార్యక్రమాన్ని గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలు టీవీల్లో తిలకించారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన టీవీల ద్వారా సీఎం ప్రసంగాన్ని విన్నారు. మండలంలోని మోపాద ఆర్‌బీకేలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఏపీ రాజ్‌కుమార్, ఏపీఎంలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదతరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం చేయాలి

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బీఎస్ఎన్ఎల్ ప్రతినిధిని సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తృతం చేయాలని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికమ్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, సంస్థ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ మర్రినాయుడు, శ్రీకాకుళం, విజయనగరం డీజీఎంలు బీవీవీ నగేష్, దోసూరి దాలినాయుడు బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం పలువురు ప్రతినిధులను, అడ్వైజరీ కమిటీ సభ్యులను ఎంపీ సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు ఇప్పిలి తిరుమల, దత్తి చిరంజీవి, మహంతి కృష్ణ, మోహన్, రాంబాబు, కాలేపు శేఖర్, అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా హర్షణీయం



మాట్లాడుతున్న ఏపీ బిషప్ కౌన్సిల్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే దిశగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ యజ్జల బాలరాజు అన్నారు. శనివారం స్థానిక గ్రేస్ చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, దళితుల పక్షాన అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బిషప్ డేవిడ్, రెవరెండ్ సత్యరాజ్, పిరిడిపాల్, మధుమనోహర్, యబ్బోజు చౌదరి, నతానియే, భాను, పాల్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవరెండ్ జాన్ మోజెస్ దుస్సి శనివారం ప్రకటనలో తెలిపారు.

అపజయం విజయానికి ప్రేరణ

• విప్రో గ్లోబల్ జీఎం హెచ్ఆర్ ప్రవీణ్‌కామత్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్రో గ్లోబల్ జీఎం హెచ్ఆర్ ప్రవీణ్‌కామత్



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తదితరులు

డెంకాడ: ఏ రంగంలోనైనా అపజయాన్ని విజయానికి ప్రేరణగా తీసుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం దరిచేరుతుందని బెంగుళూరుకు చెందిన విప్రో గ్లోబల్ జీఎం హెచ్ఆర్ ప్రవీణ్‌కామత్ కుమ్బల అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ కామత్ మాట్లాడుతూ, ఓటమితో కుంగిపోకూడదని సూచించారు. అపజయాల నుంచి మొదలై విజయాన్ని అందుకుని ఉన్నత శిఖరాల్లో ఎదిగిన వారు చాలా మంది ఉన్నారని, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయోగాత్మక, పరిశోధనాత్మక విధానంలో విద్యాభ్యాసం చేపట్టాలని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే వినూత్నమైన ఆలోచనలతో, దృఢసంకల్పంతో సాగాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని అమెజాన్‌లో క్లౌడ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న బుర్రా శ్రావ్య మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థి దశ నుంచి అమెజాన్‌లో ఉద్యోగం పొందేవరకూ తీసుకున్న జాగ్రత్తలు,ప్రేరణ పొందిన అంశాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి, పూర్వ విద్యార్థులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు తమ్మినేని హరిబాబు, ఏవీ పరాంకుశం, డీన్ జి.ప్రకాష్‌బాబు, విభాగాధిపతులు రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, సతీష్ పూజారి, దుర్గాశైలజ, జి.సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యాదవ హక్కుల సాధనే ధ్యేయం



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న శేఖర్ యాదవ్

విజయనగరం టౌన్: యాదవ హక్కుల సాధనే ధ్యేయంగా పని చేయాలని జాతీయ యాదవహక్కుల పోరాట సమితి రాష్ట్ర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యాదవులంతా ఐకమత్యంగా ఉండాలని, యాదవుల సమస్యలపై కార్యవర్గం స్పందించి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంప శివకుమార్ యాదవ్, గౌరవాధ్యక్షుడు చావలి రాజేశ్వరరావుయాదవ్, అధ్యక్షుడు మాణిక్యాల వెంకటరావు యాదవ్, ప్రధాన కార్యదర్శి గోకివాడ అప్పలనాయుడు, చింతారావు, లోవరాజు, గంపల దండు, ధనరాజు, రఘు, కిల్లాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా ప్రసాదరావు



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా కేఆర్‌డీ ప్రసాదరావు ఎన్నికయ్యారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ వైస్ చైర్మన్‌గా ఆర్.రాజగోపాల్ నాయుడు, కోశాధికారిగా టి.రామారావుతో పాటు 13 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు కార్యదర్శి కె.సత్యం ప్రకటించారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు డీఆర్‌ఓ ఎం.గణపతిరావు పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. సమావేశంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ తరఫున పరిశీలకులుగా రాష్ట్ర వైస్ చైర్మన్ జి.జగన్‌మోహన్‌రావు, విశాఖపట్టణం చైర్మన్ డీవై శివనాగేందర్‌రెడ్డి వ్యవహరించారు. తొలుత జిల్లా కార్యదర్శి కె.సత్యం మూడేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ పి. నాగేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దాసన్నపేట, తోటపాలెం, ధర్మపురి 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడవు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో అడ్మిషన్లకు ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్‌కు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సత్ప్రవర్తనతో నడుచుకుంటే కేసులు మాఫీ

గజపతినగరం: రౌడీషీటర్లుగా కేసులు నమోదైన వారు సత్ప్రవర్తనతో నడచుకున్నట్లయితే వారిపై ఉన్న కేసులను రికార్డుల నుంచి తొలగిస్తామని ఎస్సై గంగరాజు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం రౌడీషీటర్లతో సమావేశమై ఈ మేరకు అవగాహన కల్పించారు. సమాజంలో అందరికి ఉపయోగపడేలా మంచి పనులు చేస్తూ.. సత్ప్రవర్తన, నైతిక విలువలతో నడచుకుంటే వారిపై ఉన్న కేసులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొట్టివేయడం జరుగుతుందన్నారు.

కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి

• డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: బీజేపీ పెద్దలు కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థను చెప్పుచేతుల్లో పెట్టుకుని రాహుల్‌గాంధీకి రెండు సంవత్సరాల జైలుశిక్ష వేయించడంతో పాటు, పార్లమెంట్ నుంచి బహిష్కరించడం తగదన్నారు. దేశంలో కక్షపూరిత రాజకీయాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు విశేష స్పందన రావడంతో బీజేపీ నాయకులు ఓర్వలేక కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్, ఏఆర్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ ప్రభంజనం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అకాడమీ డైరెక్టర్ రమేష్

విజయనగరం పూల్‌బాగ్:

సీఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్) ఇంటర్ ఎగ్జామ్స్ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ ప్రభంజనం సృష్టించింది. 66 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని డైరెక్టర్ ఎ. రమేష్ తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సీహెచ్ సాహితి, పి. సాయిసందీప్, పి. శరత్‌చంద్ర, పి. రత్నవినీక్య, సీహెచ్ అభిలాష, కె. నీలిమ, ఎస్. శ్రావ్య, డి.ఉసజ్ఞ, కె. భావన, జి. భార్గవ్‌లను అభినందించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్వీ రమణమూర్తి అన్నారు. మండలంలోని కొండవెలగాడలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హౌసింగ్ సిబ్బంది, ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంతో బహుళ ప్రయోజనాలు



మైక్రోఇరిగేషన్ యూనిట్లను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

శృంగవరపుకోట: బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో రైతులు సీహెచ్.దేముడు, గోగాడ అప్పలనాయుడుకు రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను శనివారం పరిశీలించారు. మెట్టు ప్రాంతాల్లో పంటల సాగుకు బిందు, తుంపర, సూక్ష్మ సేద్య విధానాలు లాభదాయకంగా ఉంటాయన్నారు. ఎరువుల యాజమాన్యంలో మెలకువలు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. మండలంలో 24 మంది రైతులకు రూ.4,86,495లతో 56 సూక్ష్మ సేద్యం యూనిట్లు మంజూరు చేశామన్నారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు స్థానిక ఆర్‌బీకేలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లోచర్ల రవి, ఏఓ మూర్తి, తదితరులు హాజరయ్యారు.

ఆదర్శ సమాజానికి రామాయణం దిక్సూచి



ప్రవచనాలు చెప్తున్న సందీప్‌శర్మ

లక్కవరపుకోట: ఆదర్శవంతమైన సమాజానికి రామాయణం దిక్సూచి వంటిదని, రామాయణంలోని అంశాలను నిత్యజీవితంలో అన్వయించుకోవడం ద్వారా జీవితాన్ని ఆనందమయంగా మార్చుకోవచ్చని బ్రహ్మశ్రీ తాతా సందీప్‌శర్మ అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వసంతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో రామాయణంలో కిష్కింధకాండలోని అంశాలను సందీప్‌శర్మ వివరించారు.